

నందిగామ : చేగూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కడ్తాల్ : అన్మాస్‌పల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామారావు

# ప్రజాపాలన .. దరఖాస్తుల స్వీకరణ

- కార్యక్రమాన్ని పరిశీలించిన జడ్పీసీఈవో దిలీప్‌కుమార్, ఎమ్మెల్యే శంకర్
- జిల్లాలో రెండో రోజు
- కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ



షాబాద్: మండల కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్, డీఆర్‌డీవో ప్రభాకర్

షాబాద్, డిసెంబర్ 29: గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జిలా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు. అదే విధంగా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామసభల ద్వారా ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ...అర్హులైన లబ్ధిదారులందరూ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఆయా మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు అనురాధ, హిమబిందు, వెంకయ్య, సంధ్య, తహసీల్దార్‌లు చిన్నప్పలనాయుడు, గౌతమ్, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏవోలు వెంకటేశం, తులసి, రాగమ్మ, సర్పంచ్‌లు తమ్మలి సుబ్రహ్మణ్యేశ్వరి, చల్లా సంధ్య, కృష్ణారెడ్డి, సుహాసిని, కృష్ణ, రాములు, మహేందర్‌రెడ్డి, అర్చన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి**

నందిగామ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చేగూరులో సర్పంచ్ సంతోష, కొత్తూరు మండలంలోని ఎస్.బి పల్లి సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కొత్తూరు జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, ఎంపీపీలు ప్రియాంక, మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్ పాల్గొన్నారు.

> *రంగారెడ్డి జిల్లాలో అభయహస్తం గ్యారెంటీలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. శుక్రవారం జిల్లాలో 76,838 దరఖాస్తులు అందాయి. వాటిలో గ్రామ పంచాయతీల్లో 34,366 దరఖాస్తులు ఉండగా.. మున్సిపాలిటీల్లో 42,472 దరఖాస్తులు వచ్చాయి. –ఇబ్రహీంపట్నం :*

**పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

కడ్తాల్ : ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజాపాలన కార్యక్రమ నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామారావు అన్నారు. శుక్రవారం అన్మాస్‌పల్లి, చల్లంపల్లి, గాన్గుమార్ల తండా, సాలార్‌పూర్ గ్రామాల్లో ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్మాస్‌పల్లి, చల్లంపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. తలకొండపల్లి మండలంలోని రాంపూర్, పడకల్, లింగరావుపల్లి, చెన్నారం, చుక్కాపూర్, మెదక్‌పల్లి, గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ముంతాజ్, రంగారెడ్డి, ఎంపీడీవోలు రామకృష్ణ, శ్రీకాంత్, డీటీ వినోద్‌కుమార్, సర్పంచ్‌లు శంకర్, కృష్ణయ్య యాదవ్, హంశ్యా, విజయలక్ష్మి, వెంకట్రామిరెడ్డి, రమేశ్, ఎల్లమ్మ, స్వప్న, కిష్టమ్మ, ధరణి పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌రూరల్** : అర్హులందరికీ కాంగ్రెస్ శ్రీకారం చుట్టిన 6 సంక్షేమ ఫథకాలు అందుతాయని జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలోని బూర్గుల గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, ఎంఈవో శంకర్‌రాథోడ్, ప్రజాపాలన ఇన్‌చార్జి గిరిరాజు, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మౌనిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: దరఖాస్తులను స్వీకరిస్తున్న జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి

**దరఖాస్తు ఫారాలను విక్రయించొద్దు**

తుర్కయంజాల్ : దరఖాస్తు ఫారాలను జీరాక్స్ కేంద్రాలు, ఇతర దుకాణాల్లో విక్రయించవద్దని, వార్డుల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాపాలన తీరును స్థానిక కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధన్‌రాజ్, ఏఈ మల్లికార్జున్ పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌టౌన్** : ప్రజల క్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న కార్యక్రమాన్ని పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చెన్నయ్య, దేవయ్య, రఘుమారెడ్డి, సత్యం పాల్గొన్నారు.

**పెద్దఅంబర్‌పేట** : మున్సిపాలిటీలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం గ్యారెంటీల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 24 వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో స్థానిక కౌన్సిలర్లు దేవిడి గీత, పరశురాంనాయక్, కమిషనర్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డితో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెద్దఅంబర్‌పేటలోని ఉన్నత పాఠశాలలో కౌన్సిలర్ పసుల రాజేందర్, కుంట్లూరు వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ హరిశంకర్, 14వ వార్డులో తొండాపు రోహిణిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు దరఖాస్తులు స్వీకరించారు.



పెద్దఅంబర్‌పేట : దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి తదితరులు

**ఇబ్రహీంపట్నంరూరల్** : మండల పరిధిలోని ఎలిమినేడు, పోచారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం** : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని బాలికల ఉన్నత పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణను మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది.

**ఆమనగల్లు** : ఆమనగల్లు మున్సిపాలిటీలోని 4,5,6 వార్డుల్లో , మండల పరిధిలో చింతలపల్లి, మంగళపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను అధికారులు, సిబ్బంది స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నేనావత్ అనిత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, ఏడీఈ శ్రీనివాసులు, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో ఫారూఖ్ హుస్సేన్,కమిషనర్ శ్యామ్‌సుందర్, వైస్ చైర్మన్ దుర్గయ్యా, ఏఈలు సీతారం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్** : మండలంలోని బాటసింగారం, బండరావిరాల గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ రేఖ, జడ్పీటీసీ బింగిదాస్‌గౌడ్, తహసిల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీవో మమతాబాయి, సర్పంచ్‌లు ఎర్రవెల్లి లతశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కేశెట్టి వెంకటేశ్, దంతూరి అనిత పాల్గొన్నారు.



ఆమనగల్లు మున్సిపాలిటీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

## ఎమ్మెల్యేను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

తుర్కయంజాల్, డిసెంబర్ 29: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలతో పాటు ప్రత్యేకంగా ఉద్యమకారుల అభ్యున్నతికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశంగౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

ఇబ్రహీంపట్నంరూరల్ : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన పాలకూర ఐలేశ్ 2024 క్యాలెండర్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో డీసీసీ ఉపాధ్యక్షులు మహ్మద్ గౌస్‌పాషా, కాంగ్రెస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, మడుపు సాయితేజ, రాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

## వైట్‌కోట్, స్టెతస్కోప్‌లు అందజేత

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 29 : ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం హోమియోపతిక్ మెడికల్ కళాశాల అండ్. ఆస్పత్రిలో మొదటి బ్యాచ్ విద్యార్థులకు వైట్‌కోట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి బ్యాచ్ విద్యార్థులకు కళాశాల వైస్‌చైర్మన్ కోహ్లీ వైట్ కోట్‌లు, స్టెతస్కోప్‌లను విద్యార్థులకు అందజేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆమనగల్లు, డిసెంబర్ 29 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు కానుగుల అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంపై దృష్టి సాధించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, స్టాలిన్, వేణు, శివ పాల్గొన్నారు.

## గోవా కేంద్రంగా మాదక ద్రవ్యాల సరఫరా

షాద్‌నగర్, డిసెంబర్ 29 : గోవా కేంద్రంగా చేసుకొని మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న ముఠాను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ రంగస్వామి శుక్రవారం సాయంత్రం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వెల్లడించారు. పక్క సమాచారంతో గురువారం రాత్రి ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ టోల్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రియాంకరెడ్డి అలియాస్ ప్రియా, ఎం. శ్రీతేజ సుమారు రూ. లక్ష విలువ చేసే ఎండీఎంఎ అనే రకం మాదకద్రవ్యాలను గోవా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా గుర్తించి వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా రష్యాకు చెందిన ఓ మహిళా సహకారంతో గోవా కేంద్రంగా ఈ తరహా అక్రమ వ్యాపారానికి తెర లేపినట్లు గుర్తించామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఈ మాదకద్రవ్యాలను విక్రయించేందుకు ఇరువురు ప్రయత్నించారని చెప్పారు. నిషేదిత డ్రగ్‌ను విక్రయిస్తే శాఖపరమైన కఠిన చర్యలు ఉంటాయని, నిందితులపై పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. నిందితులను పట్టుకొవడంతో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

**పోలీసుల పేరుతో దోపిడీలు**

నకిలీ పోలీసుల పేరుతో దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని అన్నారం జంక్షన్ వద్ద ఈ నెల 5న నారాయపేట జిల్లా మక్తల్ పరిధిలోని జానంపేట నుంచి వడ్ల లోడ్‌తో ఓ లారీ హైదరాబా ద్ వైపు వెళ్తుంది. నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఇద్దరు వచ్చి పోలీసుల పేరుతో లారీ డ్రైవర్ వద్ద ఉన్న రూ. 50 వేల నగదును దోచుకున్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ చింతల్ మెట్‌కు చెంది న సయ్యద్ అన్వర్ అలియాస్ లాల, ఎండీ షోహెబ్ అనే ఇద్దరు వ్యక్తులను అనుమాని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. కేసు ఛేదనలో ప్రతిభను చూపిన పోలీసులను అభినందించారు.

## దవడ ఎముకలకు ఉచిత ఆపరేషన్లు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 29: దవడ ఎముకలకు సంబంధించి చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి దవాఖానలో ఉచిత ఆపరేషన్లు చేస్తున్నామని మాక్సిలో ఫెషియల్ సర్జన్ వసంత ధార తెలిపారు. శుక్రవారం చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖంపై తీవ్రమైన గాయాలు, దవడెముకలు విరిగితే ఆపరేషన్ చేస్తున్నట్లు తెలిపారు. మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని, మత్తు వైద్యులు మ్యాక్సీలో ఫేషియల్ సర్జన్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. సమావేశంలో మత్తు వైద్యులు, రాజా, దవాఖాన ఇంచార్జి వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.